# భూపాలరాగం

సరిగ్గా ఆ మేడ ముందుకి రాగానే ఇద్దరి చూపులూ అటు తిరిగాయి. చెట్ల మధ్య ఉన్న ఆ తెల్లని మేడ ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది.

రోజూ సాయంత్రం అటువైపు వాకింగ్‌కి రావడం మాలతికీ, శేఖర్‌కీ అలవాటైపోయింది. సందడిగా పిల్లలంతా ఎవరికి నచ్చిన ఆటలు వాళ్ళు ఆడుకుంటూ, పరుగులెడుతూ, కిలకిల నవ్వుతూ కేరింతలు కొడుతూ వుంటారు.

అది ఒక అనాథాశ్రమం.

ఆ ఆశ్రమాన్ని నడుపుతున్న ఇంద్రాణీదేవి దయగల మంచిమనిషి. లక్షలకి వారసురాలై, నా అన్నవారు లేని ఏకాకి. తన ధనాన్ని సద్వినియోగపరచాలన్న ఉద్దేశంతో, మంచి మనసుతో, పట్టుదలతో ప్రతిఫలమాశించకుండా ఈ అనాథాశ్రమాన్ని నడుపుతోంది, తన స్వంత మేడలో.

ఎవరినో మెప్పించి కీర్తినార్జించాలనిగానీ, తన పేరు పేపర్లో చూసుకోవాలనిగాని ఆమె ఉద్దేశం కాదు.

ఆశ్రమంలో బాలబాలికలకి చదువు సంధ్యలు, ఆటపాటలూ అన్నీ నేర్పబడుతూ ఉంటాయి. నా అన్నవారు కరువైన పిల్లలే అందులో ఉన్నవాళ్ళందరూ కూడా. అన్ని వయసుల పిల్లలూ ఉన్నారు.

శేఖర్‌కి ఇంద్రాణీదేవితో బాగా పరిచయం ఉంది. ఎప్పుడైనా ఒకోసారి వెళ్ళి కాసేపు ఆవిడతో కబుర్లు చెప్పి వస్తూంటాడు.

రోజూ సాయంత్రం అటువైపు వాకింగ్‌కి వెళ్తుంటే, ఏ పిల్లాడి మీద తమ చూపులు నిలిచిపోతాయో ఆ పిల్లాడిమీదే ఈ రోజు కూడా భార్యాభర్తలిద్దరి చూపులూ నిలిచిపోయాయి.

పరుగులెట్టి ఆడుతున్న పిల్లలవంక చూస్తూ, చప్పట్లు కొడుతూ సంబరంతో నవ్వుతున్నాడా చిన్నారి బాబు వరండాలో స్తంభం పక్కన నిలబడి. కళగల ముఖం .... ముద్దొస్తూ ఉంటాడు.

ఆడుకుంటున్న బంతి గేటు దగ్గిర పడితే, అది తీసుకుందుకు వొచ్చిన ఓ కుర్రాడిని అడిగేసింది మాలతి ఉండబట్టలేక, స్తంభం పక్కన నిలబడిన పిల్లాడిని చూపిస్తూ " ఆ బాబు పేరేమిటి ? "

" ఆ బాబు పేరు ప్రభాత్ " చెప్పేసి, తన బంతి తీసుకుని వెళ్ళిపోయాడా కుర్రాడు.

" వాడెంత ముద్దొస్తున్నాడో, పేరు కూడా అంత అందమైనది పెట్టింది కదండీ ఆ ఇంద్రాణిదేవి " భర్త వంక చూసింది. మాలతికే కాదు, శేఖరానిక్కూడా పిల్లలంటే చాలా ఇష్టం. వాళ్ళ పెళ్ళయి ఏడాదిన్నరయింది.

*

ఈ మధ్య మాలతికి బెంగ పట్టుకుంది, తమ ఇంట్లో పసిపాప తారట్లాడుతుందా లేదా అని ....

ఈ మాటే అస్తమానం భర్తతో అంటుంటే, మన పెళ్ళయి ఎన్నో ఏళ్ళయిపోయినట్టు ఎందుకంత బెంగపడిపోతావు అంటూ తేలిగ్గా కొట్టిపారేస్తున్నాడతను.

అతని మాటలకి ఆశ్చర్యమనిపిస్తుంది మాలతికి .... ఎందుకంటే.... పసిపిల్లలంటే అతనికి ప్రాణం. ఇరుగు పొరుగు పిల్లలతో కాలమే మర్చిపోయి తనూ ఒక పిల్లాడిలా కలిసిపోయి ఆడుకుంటాడు. ఏ పిల్లాడికైనా కాస్త దెబ్బ తగిలితే తనకే తగిలినట్టు గిలగిల్లాడిపోతాడు. తరచుగా ఇరుగుపొరుగు పిల్లలకి చాక్లెట్లు, పాపిన్స్ కొనిస్తూ ఉంటాడు.... ఎత్తుకు తిప్పుతూ వుంటాడు .... ఇంట్లో పిల్లలు తిరగకపోతే ఇంటికి అందమే లేదన్నట్టు మాట్లాడుతాడు కూడా .... అటువంటివాడు ' ఒకసారి డాక్టర్ దగ్గరకెళ్ళి పరీక్ష చేయించుకుంటానండీ, ఎందుకయినా మంచిది ' అని తనంటే ' ఎందుకంత కంగారుపడిపోతావు. డాక్టర్లేదు పరీక్షలేదు.... ఏ బెంగా, ఏ ఆలోచనా వొద్దు. హాయిగా కొన్నాళ్ళు సరదాగా గడుపు ' అంటూ తన మాటలు కొట్టిపారేయటం ఆశ్చర్యంగానే ఉంటుంది మరి మాలతికి.

ఆరోజు శేఖర్ ఇంటికి వొస్తూనే హడావిడి చేశాడు " అర్జంటు పని తగిలింది. క్యాంపు వెళ్ళాలి "

" అబ్బా ! అస్తమానం ఈ క్యాంపులేవిటో మీకు ? ఇవ్వాళ డాక్టర్ దగ్గరకి తీసికెళ్ళమని అడగాలనుకున్నాను మిమ్మల్ని .... "

" అరే ! ఏమైందీ ! ఒంట్లో బాగులేదా ? " కంగారు పడ్డాడు.

" ఒంట్లో బాగానే ఉంది "

" మరి ? .... "

" మరి .... మరి .... అదే .... అదేనండి .... పరీక్ష చేయించుకుందామని " తలొంచుకుని నసిగేసింది.

అర్థమైంది శేఖర్‌కి.

" అక్కర్లేదని చెప్పానుగా మాలతీ "

" ఎందుకక్కర్లేదూ ? వోన్లెండి. మీరు రాకపోతే నేనొక్కదాన్నే వెళ్ళలేననుకుంటున్నారా ? .... వెళ్తాన్నేను "

" మాలతి .... " అతని గొంతులో మార్పు గమనించింది.

" నాకు రైలుకి టైమైపోయింది. ఊర్నొంచివొచ్చాక తీరుబడిగా మాట్లాడుకోవచ్చు .... డాక్టర్ దగ్గిరకేమీ వెళ్ళక్కర్లేదు. ఏ వర్రీ లేకుండా నిశ్చింతగా ఉండు. "

అతని మాటలేమాత్రం రుచించలేదు మాలతికి.

అన్యమనస్కంగానే అతనికి ప్రయాణానికి కావలసినవి సర్ది ఇచ్చింది. వెళ్ళిపోయాక, ఏదో పత్రిక చేతిలోకి తీసుకుని కూర్చుంది.... కళ్ళు చూస్తున్నాయన్న మాటేగాని మనసు దానిమీద లేదు .... పరిపరి విధాల ఆలోచనలు పోతున్నాయి .... పరీక్ష చేయించుకుంటానంటే ఎందుకు వెళ్ళనివ్వట్లేదు తనని ? ఏమై ఉంటుంది కారణం ? ఒకవేళ .... ఒకవేళ ... తనకి తెలియకుండా అతనెప్పుడైనా పరీక్ష చేయించుకున్నాడేమో ? అతనిలో, లోపం ఉందని చెప్పారేమో ? ఆ నిజం తనతో చెప్పడం ఇష్టంలేక చెప్పిఉండడు .... ఇప్పుడు .... తను పరీక్ష చేయించుకుంటే.... తనలో ఏ లోపం లేదని డాక్టర్ చెప్పేస్తే .... అతనిలోనే లోపం ఉందన్న నిజం తనకి తెలిసిపోతుందని .... పరీక్ష చేయించుకుందుకు తనని వెళ్ళనివ్వట్లేదేమో .... ఔను .... అంతే అయి ఉంటుంది...

తన భర్త మంచివాడనీ, నిజాయితీపరుడనీ, భార్య దగ్గర దాపరికాలు ఉన్నవాడు కాదనీ సంతోషపడుతోంది ఇన్నాళ్ళుగా తను .., తన ఊహలన్నీ తలకిందులేనా ? ... తీయని తన కలలు కల్లలేనా ? ...

లోపం అతనిలో ఉన్నందుకు కాదు తన బాధ ...

ఆ నిజం తనతో చెప్పకుండా రోజులు దాటెయ్యాలని అతను చూస్తున్నందుకే బాధగా ఉంది ...

అతనంతట అతనే నోరుతెరచి ... పరీక్ష చేయించుకున్నాననీ, తనలో లోపం ఉందనీ ఒక్క ముక్క చెప్పేస్తే నిజం దాచిపెట్టకుండా చెప్పాడన్న తృప్తి అయినా మిగిలేది. మాలతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

*

ఊర్నించి తిరిగి వొచ్చాక వివరంగా మాట్లాడతానన్న మనిషి ఆ విషయమే మాట్లాడక పోవటం మాలతి అనుమానాన్ని మరింత బలపరచింది.

తనంతట తానుగా మాలతి ఆ విషయం ప్రస్తావిస్తే అప్పుడు చూడొచ్చు ... లేకపోతే ఇప్పుడు ఏమీ మాట్లాడక పోవటమే మంచిదని ఊరుకున్నాడు శేఖర్.

ఆ రోజంతా అతి కష్టమ్మీద గడిపింది మాలతి. మర్నాడు ఆదివారం ... మధ్యాహ్నం వరకూ ... తుఫాను ముందరి ప్రశాంతతలా గడిపి ... అప్పుడింక ఉండబట్టలేక అడిగేసింది మనసులో మాట.

"నువ్వు బాధపడనంటేనూ, తేలిగ్గా తీసుకుంటానంటేనూ చెప్తాను" చిరునవ్వుతో నెమ్మదిగా అన్నాడు.

అంత శాంతంగా ఎలా నవ్వగలుగుతున్నాడో ! ఆశ్చర్య మనిపించింది మాలతికి.

" చెప్పండి ... ఏం చెప్పినా, ఏం వినవలసివచ్చినా బాధపడను. చెప్పకుండా రహస్యంగా ఉంచేస్తేనే బాధపడతాను ... "

దగ్గరగా వొచ్చి, భార్యని ఆప్యాయంగా చేతుల్తో చుట్టేశాడు.

" నువ్వు దిగులుపడుతుంటే నేను చూడలేను ... నువ్వు సంతోషంగా ఉండటమే నాక్కావలసింది ... నువ్వు తల్లివి కాలేవు. ఆ నిజం తెలిస్తే ఏడుస్తూ కూచుంటావేమో రోజూ అని, నువ్వు డాక్టర్ దగ్గరికి వెళతానన్నప్పుడల్లా ఏదో వంకతో వెళ్ళనియ్యట్లేదు నేను. నీలో,

లోపం ఉందని నువ్వు తల్లి వి కాలేవని, నిన్ను పెళ్ళిచేసుకునే ముందే తెలుసు నాకు ... మెల్లిగా ఇంకో ఏడాదో, రెండేళ్లో పోయాక నెమ్మది మీద నీకీ విషయం చెప్పి ... "

అతని మాట పూర్తి కానేలేదు, తనని చుట్టిన అతని చేతుల్ని విదిలించుకుని దూరంగా జరిగింది మాలతి.

" ఎందుకండీ లేనిపోని మాటలు ? కథలేవో అల్లి నన్ను మభ్య పెట్టాలని చూడకండి ... పెళ్ళికిముందు మీరెవరో నాకు తెలియదు .... నేనెవరో మీకు తెలియదు .... అటువంటప్పుడు .... పెళ్ళికి ముందే మనకేదో పరిచయం ఉన్నట్టే మాట్లాడుతున్నారే ? పైగా ఆ మాటలు కూడా మామూలు మాటలు కాదు .... రంపపు కోతలు .... మిమ్మల్ని మీరు ఒక మహామనిషిగా .... మహాత్మునిగా చిత్రించుకోవాలని సరదా పడుతున్నారా .... అటువంటి కోరిక మీకేమైనా ఉంటే .... అది తీర్చుకునే మార్గం ఇది కాదండీ .... ఇది కాదు "

" మాలతీ .... "

" వొద్దండీ వొద్దు .... మీకు మీరుగా త్యాగశీలి అన్న ముద్ర వేసుకోవాలని ప్రయత్నించకండి .... దానికి నన్ను ఎరగా చేసుకోవాలని చూడకండి .... " దుఃఖం, కోపం పోటీపడి తరుముకొస్తుంటే మరి మాట్లాడలేక అక్కడినించి లేచింది. జాలిగా ఆమెవంక చూస్తూ, చిన్నగా నిట్టూర్చి, మాలతీ అంటూ ఆమె వెనకే గదిలోకి వెళ్ళబోయాడు.

" నన్ను కాసేపు ఒంటరిగా ఉండనివ్వండి " అంటూ ఆమె గది తలుపులు చేరవేస్తుంటే, చేసేదిలేక, పోన్లే ఆమె మనసు కాస్త కుదుట పడనీ అనుకున్నాడు.

మరి కాసేపట్లో ఊర్నించి మావగారు రావడంతో, భార్యని పిలవక తప్పలేదు. గబగబా కాళ్ళూ, మొహం కడుక్కుని, తప్పనిసరిగా ఇవతలకి వొచ్చింది మాలతి.

" పెద్ద చెల్లెలికి రేపు పెళ్ళిచూపులు ... నిన్ను తీసుకురమ్మని పంపించింది అమ్మ " వొచ్చిన కారణం చెప్పాడాయన.

" ఇంకో అరగంటలో బస్సుంది ... పెద్దాం ... బయల్దేరగలవా?"

భర్తవంక చూసింది మాలతి.

" వెళ్ళిరా మాలతీ ... " మనస్ఫూర్తిగా అన్నాడు ఆమె చూపుల భావం అర్థంచేసుకొని శేఖర్.

*

పడుకున్నాడన్నమాటేగానీ, నిద్ర రావట్లేదు శేఖర్‌కి. మాలతి రూపమే కంటిముందు నిలిచింది. పిచ్చిపిల్ల ... ఎంత బాధపడిపోతోందో ఏమో నిజం తెలిసి ... ఆమెని మనస్ఫూర్తిగానే పెళ్ళిచేసుకున్నాడతను... అందులో ఏమాత్రం అబద్ధం లేదు. ఆరోజు ...

పెళ్ళి చూపులకి మాలతివాళ్ళ ఊరెళ్ళబోయేముందు, డాక్టర్ సదానందంగారి దగ్గరికి వెళ్ళి చెప్పాడు తను పెళ్ళి చూపులకి వెళ్తున్నట్టు... డాక్టర్‌గార్ని తను బాబయ్యగారూ అనే పిలుస్తాడు. నా అన్నవాళ్ళు లేని తనకి, అప్పుడు ఆయనొక్కడే. వయసులో తమ ఇద్దరికీ వ్యత్యాసం చాలానే ఉన్నా, తమ ఇద్దరి మధ్యా రహస్యాలు లేవు... ఆయన భార్య కూడా డాక్టరే. ఇద్దరూ కల్సి నర్సింగ్‌హోమ్ రన్ చేస్తున్నారు చాలా కాలంగా. జేబులోంచి అమ్మాయి ఫోటో తీసి చూపించాడు ఆయనకి. ఆ ఫోటో చూస్తూనే ఆయన భృకుటి ముడిపడింది.

" ఈ అమ్మాయి ... రంగారావుగారమ్మాయి కదూ ... వీళ్ళది మొగల్తూరు కదూ ? "

" ఔను. బాబయ్యగారూ .... మీకు తెలుసా వీళ్ళు ? "

" తెలుసు .... ఈ అమ్మాయిని చూసుకుందుకు రమ్మన్నారా నిన్ను ? .... "

" ఏమిటి బాబయ్యగారూ అంత ఆశ్చర్యపోతున్నారు ? అమ్మాయి అందంగానే ఉంది కదా ? "

" శేఖర్ .... నూరు అబద్ధాలాడైనా ఒక పెళ్ళి చెయ్యమన్నారు.... కానీ .... ఒక నిజం చెప్పి ఏ పెళ్ళీ చెడగొట్టమన్లేదు .... పైగా డాక్టర్‌గా నా ధర్మం నాకుంది. వైద్యానికొచ్చే వ్యక్తుల అనారోగ్యాల గురించి ఇతరులతో చెప్పకూడనివేమైనా ఉంటే చెప్పకుండా ఉండడం నా ధర్మం. కానీ నువ్వు నాకు ఆప్తుడివి. కష్టానికీ, సుఖానికీ, మంచికీ, చెడుకీ నేను తప్ప నీకు మరెవరూలేరని ఎన్నోసార్లన్నావు .... అటువంటి నేను .... జీవిత భాగస్వామిని నువ్వు ఎన్నుకోబోతుంటే .... నీతో ఈ నిజం చెప్పకుండా నాకెందుకులే అని ఊరుకోలేను .... ఇటువంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. "

ఆయనెందుకంత ఇబ్బందిగా ఫీలవుతున్నారో అర్థం కాలేదు శేఖర్‌కి.

" అసలు సంగతేమిటి బాబయ్యగారూ ? .... "

" ఇదివరకీ అమ్మాయికి కడుపులో నెప్పి తరచుగా వొస్తూఉండేది. దానిమూలంగా జ్వరం వాంతులు కూడా వొచ్చేవి. ఎన్ని మందులు వాడినా తగ్గకపోతే ఈ ఊరొచ్చి మా నర్సింగ్‌హోమ్‌కి తీసుకొచ్చారు.... మా ఆవిడే వైద్యం చేసింది ... ఊఫెక్టమీ చేయవలసొచ్చింది ఆ అమ్మాయికి. "

" అంటే ? " అనుమానం కదలాడింది అతని గొంతులో.

" చీము పట్టటంవల్ల .... తప్పనిసరి పరిస్థితుల్లో ఒక ఓవరీ తీసేయవలసివచ్చింది ఆ అమ్మాయికి .... రెండో ఓవరీ ఉన్నా కూడా... ఇన్ఫెక్షన్ పాకిపోవడంవల్ల గొట్టం మూసుకుపోయింది .... పిల్లలు పుట్టే అవకాశం లేదని .... ఆపరేషన్ చెయ్యడానికి ముందే ఆ పిల్ల తల్లిదండ్రులతో చెప్పాము .... పెళ్ళి చేసుకోవడానికి, దాంపత్య జీవితానికి అనర్హురాలు మాత్రం కాదు ఆ అమ్మాయి. అదే విషయం వాళ్ళతో చెప్పాము. తమ కూతురి దగ్గరమటుకు ఈ ఆపరేషను గురించిన వివరాలేమీ చెప్పవద్దని మమ్మల్ని రిక్వెస్టు చేశారు. ఆ పిల్లకి తెలిస్తే పెళ్ళిచేసుకోనని అంటుందనీ, దాని మూలంగా రకరకాలుగా పుకార్లుపుట్టి, తర్వాతి ముగ్గురి కూతుళ్ళకి కూడా పెళ్ళిళ్లు కాకుండా పోతుందనీ భయపడ్డాడా తండ్రి .... అందుకే, ఆ అమ్మాయికి మాత్రం తెలియదు. తనకి జరిగింది ఊఫెక్టమీ అని, నిజానికి డాక్టర్లుగా మాకు, కన్నవాళ్ళుగా ఆ తల్లిదండ్రులకి మాత్రమే తెలుసు. బయటివాళ్ళెవరికీ తెలియదు.... పెళ్ళికాని అమ్మాయికి ఈ రకమైన ఆపరేషన్ చేయవలసి రావడం అరుదైన విషయమే అనుకో .... కానీ, ఏం చేస్తాం ? .... అరుదైన కేసుల్లో ఇదొకటి .... ఇలా జరగటం అరుదే కానీ, ఎప్పుడూ ఎక్కడా, ఎవరికీ జరగదని గ్యారంటీగా బల్లగుద్ది చెప్పలేం .... " బయటనించి ఎవరో పిలవడంతో, చెప్పడం ఆపి గదిలోంచి అవతలకి వెళ్ళారు డాక్టర్ సదానందం.

తీవ్రాలోచనలో పడ్డాడు శేఖర్.

ఎంతసేపలా కూర్చున్నాడో తనకే తెలియదు.

మళ్ళీ చాలాసేపటికి డాక్టరుగారొచ్చి పలకరించేవరకూ ఈ లోకంలోకి రాలేదు.

" ఈ అమ్మాయిని చేసుకుందుకు నాకేం అభ్యంతరం లేదు బాబయ్యగారూ "

" బాగా ఆలోచించుకో శేఖర్ .... ఇలా నిమిషాల్లో నిర్ణయం తీసుకునే విషయం కాదుగా ఇది! .... ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, తొందరపడ్డానేమోనన్న బాధ ముందు ముందు కలగకూడదు మరి .... "

" లేదు బాబయ్యగారూ .... బాధపడను. బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను. నేను అనాధగా పెరిగాను. చిన్నప్పటినించీ ఎన్ని కష్టాలో ఎదుర్కొని, ఎంతమందిచేతో మాటలు పడుతూ ఎన్ని అవమానాలో మనసులో దిగమింగుకుని, కష్టం సుఖం చెప్పుకుందుకుగానీ పంచుకుందుకుగానీ, నా అన్నవాళ్ళు ఒక్కరంటే ఒక్కరు లేక, చదువు ఉద్యోగం ఈ రెండే ధ్యేయంగా ఎంతో శ్రమపడి, పగలు నా శక్తిమేరకి పనులుచేసి సంపాదించుకుంటూ రాత్రిళ్ళు చదువుకుంటూ ప్రైవేటుగా పరీక్షలు రాసి అంచెలంచెలుగా పైకి వచ్చాను .... పెళ్ళంటూ చేసుకుంటే నా పిల్లలు ఒకరో ఇద్దరో నాకు ఉన్నా ఒక అనాధ శిశువును చేరదీసి పెంచి పెద్ద చెయ్యాలన్న కోరిక నాలో ఎప్పటినించో బలంగా నాటుక పోయింది. ఈ విషయం మీతోకూడా ఓసారి చెప్పాననుకుంటాను "

" ఔను .... చెప్పావు .... "

" ఆ వొచ్చే భార్య కూడా అందుకు ఒప్పుకోవాలికదా .... ఆమె సహకారం కూడా లేనిదే .... ఒక అనాధ శిశువుని చేరదీసి పెంచి పెద్ద చెయ్యాలన్న నా కోరిక సవ్యంగా సాగదు .... ఈ భయంతోనే, ఈ అనుమానంతోనే, పెళ్లి సంబంధాలు ఎన్ని వొస్తున్నా ఇప్పుడప్పుడే చేసుకోను అంటూ తప్పించుకుంటూ వొస్తున్నాను. ఇప్పుడీ సంబంధం విషయంలో నాకేమీ అభ్యంతరం లేదు. పిల్లలు కలిగే అవకాశం లేనంతమాత్రాన, వివాహ జీవితానికి అర్హురాలైనా కూడా అవివాహితగా ఆమె ఉండిపోవల్సిన అవసరం లేదు "

" నీదెంత మంచి మనసు శేఖర్ .... నీలాగ ఆలోచించగల వాళ్ళని నేనింతవరకూ చూడలేదు... "

"ఊ .... ఊ .... పొగిడేస్తున్నారు నన్ను" మొహమాటపడ్డాడు.

*

పెళ్ళికి ముందు, కాబోయే మామగారి కొక్కరికే తన మనసులో మాట చెప్పాడు శేఖర్. "పిల్లలు పుట్టరన్న విషయం మీ అమ్మాయికి తెలిస్తే అసలు పెళ్ళే చేసుకోనంటుందని కదూ మీ భయం"

"ఔను బాబూ"

"పెళ్ళయిన వెంటనే తెలియవ.సిన అవసరం కూడా లేదులెండి. మెల్లిగా రెండు మూడేళ్ళు పోయాక తెలియడమే మంచిది. ఎందుకంటే ముందే తెలిస్తే నిజం తెలిసి కూడా నేనామెని పెళ్ళిచేసుకున్నానంటే నేనెలాంటివాడినో ఏమో అన్న సందేహాలు ఆమెకి కలిగేందుకు అవకాశం ఉంది ..."

"నిజమే బాబూ .... కట్నం లేకుండా పెళ్ళిచేసుకుంటానని ఏ కుర్రాడైనా తనంతట తనుగా ప్రకటిస్తే వాడిలో ఏ లోపం ఉందో ఏమిటోనని మూతి విరుస్తుందీలోకం ... అటువంటిది పిల్లలు పుట్టరని ముందే తెలిసికూడా నువ్వు ..."

"మెల్లిగా ఏ రెండేళ్ళ తర్వాతో, నిజం తెల్సికూడా నేనీ పెళ్ళి చేసుకున్నానన్న విషయం ఆమెకి తెల్సినా .... అప్పటికి నేనెలాంటి వాడినో నా మనసెలాంటిదో ఆమెకి బాగా అర్థమైఉంటుంది కాబట్టి అనవసరమైన అనుమానాలు నా మీద కలిగేందుకు ఆస్కారం ఉండదు. లేకపోతే మొదట్లోనే ఎడమొగం పెడమొగంగా మా కాపురం మొదలవుతుంది, నేను మంచి ఉద్దేశంతోనే ఆమెని మనస్ఫూర్తిగా పెళ్ళిచేసుకున్నా కూడా, పెళ్ళయిన వెంటనే చెప్పేస్తే ఆమెకి నమ్మశక్యం కాకపోవచ్చు... అందుకే, ఆమె నన్ను పూర్తిగా అవగాహన చేసుకున్నాకే తెలియడం మంచిది ...."

" చిన్నవాడివైనా ఎంతో ముందుచూపు వుంది బాబూ నీకు.... నీ ఋణం జన్మ జన్మలకీ తీర్చుకోలేనిది .... " ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి.

*

తన భర్తమీద తనకి కలిగిన అనుమానాన్ని తల్లి దగ్గర బయట పెట్టింది మాలతి .... చెంపలు వేసుకుందావిడ. తెల్లబోయి చూసింది తల్లివంక. ఆ తర్వాత, నెమ్మదిగా తల్లితండ్రులిద్దరూ చెప్పిన అసలు సంగతంతా విని స్తంభించిపోయింది కాసేపు ... ఎంత పొరపాటుగా ఆలోచించింది తన భర్త గురించి ... మనుషుల్లో దేవుడు కాదూ తన భర్త ! ... తనకి పిల్లలు పుట్టే అవకాశం లేదన్న బాధకంటే, ఇంత మంచి మనిషిని గురించి అనవసరంగా ఏవేవో ఊహించుకున్నానే అన్న బాధే ఎక్కువ కలవరపెట్టింది మనసుని.

పుట్టింటినుంచి తిరిగి వస్తూనే భర్త మొహంలోకి చూడటానికి కూడా సిగ్గుపడింది.

వంట ప్రయత్నంలో పడింది. బయటికి వెళ్ళిన శేఖర్ చాలా సేపటి తర్వాత తిరిగొచ్చాడు ... ఉత్తచేతుల్తో రాలేదు ... ఊరికే రాలేదు ... ఆ ఇంట్లో ప్రభాత గీతాన్ని పలికించాడు ... అతని చేతుల్లో ఉన్నాడు నవ్వులు చిందిస్తున్న ప్రభాత్ ...ఆ ఇంటికి కొత్త కాంతుల్ని తెచ్చే ప్రభాత్

○